

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక
హిందూపురం పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ బాల,బాలికల జట్లను ఎంపిక చేశారు. 8లో



కిలో టమాట రూ.40
టమాట ధరలు తగ్గలేదు. అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.40, కనిష్టం రూ.20, సరాసరి రూ.30 పలికింది.

గరిష్టం/కనిష్టం
35.6°/23.2°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఉక్కపోత పెరిగింది.

న్యూస్‌రీల్

గురజాడ చిరస్మరణీయుడు



గురజాడ అప్పారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సాహిత్య ఉద్యమకారుడు, తెలుగు భాష ఔన్నత్యానికి పాటుపడిన గురజాడ అప్పారావు చిరస్మరణీయుడని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ కొనియాడారు. జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ కవితా పితామహుడిగా తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు గురజాడ ఎంతగానో కృషి చేశార్నారు. సాంఘిక దురాచారాలు, మూఢ విశ్వాసాలపై సాహిత్య సమరం చేశారన్నారు. ఆంధ్ర సాహిత్య చరిత్రలో సంస్కర్తగా, యుగకర్తగా శాశ్వత స్థానం పొందారన్నారు. తెలుగు భాషకు గురజాడ చేసిన సేవలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి. రామకృష్ణారెడ్డి, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, హౌసింగ్ పీడీ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

అనంతపురం అర్బన్: పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. 'మన ఇల్లు మన గౌరవం' అనే అంశంపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావేదిక కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. వికసిత్ అనంత కింద గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇళ్లతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వంద రోజుల లక్ష్యం కింద జిల్లాకు 2,835 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశించగా, ఇప్పటివరకు 1,390 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారంటూ హౌసింగ్ పీడీని కలెక్టర్ అభినందించారు. మిగిలిన ఇళ్లు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎంఏవై అర్బన్, పీఎంఏవై గ్రామీణ్‌లో భాగంగా ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎహసాన్‌బాషా, డిప్యూటీ కలెక్టర్లు శిరీష, కరుణకుమారి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, పీఆర్ ఎస్‌ఈ కేవీకేవీ ప్రసాద్, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

''గత ప్రభుత్వంలో విద్యాహక్కు చట్టం మేరకు ఉచిత సీట్లు కల్పించాం. ఇప్పుడు ప్రభుత్వం మారింది. నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా భరోసా ఇచ్చారు. కాబట్టి కచ్చితంగా మీరు ఫీజు చెల్లించాల్సిందే....'' ఇవీ రాప్తాడు మండలంలోని ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన మాటలు. జిల్లా వ్యాప్తంగా అన్ని కార్పొరేట్ స్కూళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తరచూ ఫోన్లు చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ ఫీజు కడతారా, పిల్లాడిని ఇంటికి తీసుకెళ్తారా అంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.



పిల్లలపై ఫీజుల కత్తి

- విద్యాహక్కు చట్టం కింద చేరిన పేద విద్యార్థులపై ప్రైవేటు స్కూళ్ల ఒత్తిళ్లు
- ఫీజు చెల్లించాలంటూ తల్లిదండ్రులకు వేధింపులు
- విద్యాశాఖ మంత్రి లోకేషే భరోసా ఇచ్చారంటూ బెదిరింపులు
- చేతులెత్తేసిన విద్యాశాఖ అధికారులు
- ఆందోళనలో బాధితులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం స్ఫూర్తికి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తూట్లు పొడుస్తున్నాయి. ఈ చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలి. అనాథ, దివ్యాంగ, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం వెరసి 25 శాతం సీట్లను కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో కేటాయించాలి. ఈ పిల్లలకు సంబంధించిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం (2024-25)లో 1,539 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో 1,162 మంది విద్యార్థులు 1వ తరగతిలో అడ్మిషన్లు పొందారు. వీరందరినీ చాలా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి 291 స్కూళ్లకు కేటాయించారు.

తెల్లకాగితాలపై సంతకాలు

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడకపోవడం వెరసి తల్లిదండ్రులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. ఫీజులు చెల్లించాలంటూ తమపై ఒత్తిళ్లు చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాహక్కు చట్టం మేరకు ఉచితంగా అడ్మిషన్లు పొందిన తల్లిదండ్రుల నుంచి యాజమాన్యాలు తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతే ఫీజు మొత్తం తామే చెల్లిస్తామంటూ అగ్రిమెంట్ రాసుకున్నారు. యాజమాన్యాల బెదిరింపులతో తల్లిదండ్రులు భయపడుతున్నారు. చాలామంది బయటకు చెప్పుకోలేని పరిస్థితి. తమ పేర్లు బయటపడితే ఫీజుల కోసం పిల్లలను మరింత ఇబ్బందులు పెడతారనే భయం వారిని వెంటాడుతోంది.

ఉచిత సలహా ఇస్తున్న అధికారులు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తూ తల్లిదండ్రులకు ఉచిత సలహాలు ఇస్తున్నారు. 'మొత్తం ఫీజు ఫ్రీ అంటే ఎలా? వారికి కూడా ఖర్చులుంటాయి కదా? కాస్తోకూస్తో చెల్లించండి' అంటూ కొందరు ఎంఈఓలు చెబుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. డీఈఓ కార్యాలయానికి వస్తే తమకు సంబంధం లేదని, సమగ్ర శిక్ష అధికారులను కలవాలంటూ చెప్పి పంపిస్తున్నారు. దీనిపై మాట్లాడేందుకు డీఈఓ వరలక్ష్మికి ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు.

Class 1 as mentioned below

Past Year Balance : 0
First Installment Fee(2024-25) : 20000
Paid : 0
Past year due & I installment Due:20000

For Online Transaction:-

Bank Name : AXIS BANK
A/c Holder Name:

విద్యాహక్కు చట్టం 12(1)సీ కింద చేరిన ఓ విద్యార్థికి సంబంధించి ఫీజు చెల్లించాలంటూ కార్పొరేట్ పాఠశాల నుంచి వచ్చిన మెసేజ్

ఈ విద్యా సంవత్సరం ఎంపికైన విద్యార్థులు **1,539**

వీరిలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు **1,162**

విద్యార్థులు చేరిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు **291**

ఫిర్యాదు చేస్తే చర్యలు

విద్యాహక్కు చట్టం 12(1)సి కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి కూడా ఫీజు వసూలు చేయకూడదు. ఆ మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. అలా కాకుండా ఎవరైనా ఫీజు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫీజు చెల్లించాలంటూ మెసేజ్‌లు పెట్టినా చర్యలు తప్పవు. ఇప్పటికే ఎవరి నుంచైనా వసూలు చేసి ఉంటే ఆ మొత్తం వెనక్కు ఇప్పిస్తాం. ఫిర్యాదుదారులు నేరుగా సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించవచ్చు.

– నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ

సజావుగా వీఆర్‌ఓల బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: సచివాలయ గ్రేడ్-2 వీఆర్‌ఓల బదిలీల కౌన్సెలింగ్ సజావుగా జరిగింది. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పర్యవేక్షణలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని సచివాలయాల్లో మొత్తం 147 మంది వీఆర్‌ఓలు ఉన్నారు. వీరిలో 109 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మ్యూచువల్ (పరస్పర) బదిలీ కింద 24 మంది, ఆరోగ్య సమస్యల కారణంగా ముగ్గురు, దివ్యాంగులు ఇద్దరు, జిల్లా నుంచి శ్రీ సత్యసాయి జిల్లాకు ఒకరు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ బదిలీల ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి మారుతీ, జేఏలు భరత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పి.విజయలక్ష్మి

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా డీఐజీగా పి.విజయలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న డీఐజీ మాధవి ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న డీఐజీ పి.విజయలక్ష్మిని అనంతపురానికి బదిలీ చేశారు. ఈ క్రమంలో ముందుగా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసిన అనంతరం విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. నూతన డీఐజీని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారులు, పలువురు సబ్ రిజిస్ట్రార్లు, ఆ శాఖ ఉద్యోగులు, జిల్లా అధ్యక్షులు షామీర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం తరపున సహాయ, సహకారాలు అందజేస్తామని తెలిపారు.

టీడీపీ నేతల ఇసుక దందా

కూడేరు: టీడీపీ నేతల ఇసుక దందాకు పోలీసులు చెక్ పెట్టారు. మండల పరిధిలోని ఎంఎం హళ్లి, జయపురం గ్రామాల సమీపాన పెన్నానది కాలువలో లభించే ఇసుక కొందరు టీడీపీ నాయకులకు ఆదాయ వనరుగా మారింది. అనధికారికంగా తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. శనివారం కొర్రకోడుకు చెందిన ఓ టీడీపీ నేత జేసీబీ పెట్టి టిప్పర్, ట్రాక్టర్‌తో జయపురం వద్ద నుంచి ఇసుకను తరలించేందుకు యత్నించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు జేసీబీ, టిప్పర్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని సీఐ శివరాముడు హెచ్చరించారు. రోడ్లు, ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలకు ఇసుక కావాల్సిన వారు రెవెన్యూ అధికారుల ద్వారా అనుమతి లేఖ తీసుకుని తోలుకోవచ్చన్నారు.





కూడేరు: స్టేషన్‌లో ఉంచిన టిప్పర్, ట్రాక్టర్, గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

గుంతకల్లు రూరల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసినట్లు గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప తెలిపారు. శనివారం ఉదయం దోనిముక్కల రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వీటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే దుష్ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మంగమ్మ

అనంతపురం కార్పొరేషన్: సూపర్ సిక్స్ హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ మంగమ్మ ధ్వజమెత్తారు. శనివారం నగర శివారులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ చేస్తున్న ఆరోపణలపై స్పందించారు. దేవదేవుడు కొలువైన తిరుమలను కూడా రాజకీయాలకు వాడుకోవడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ హామీలపై ప్రజలు నిలదీస్తారనే శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం దారుణమన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఇప్పటికే చంద్రబాబు విఫలమయ్యారన్నారు. రాజధానిగా అమరావతిని కొనసాగిస్తామనడం పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు.ఇలాంటి తరుణంలో ప్రజలను ఏదో విధంగా తప్పుదోవ పట్టించాలనే నీచ రాజకీయాలకు తెరతీశారన్నారు. పవిత్రమైన తిరుమల దేవస్థానం ప్రతిష్టకు భంగం కల్గేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం దుశ్చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

● పూలు.. ధర లేక దిగాలు!



సతీష్ నాయుడు పొలంలో విరగబూసిన కనకాంబరాలు

పండించిన పంటకు ఎప్పుడు మంచి ధరలు అందుతాయో.. ఎప్పుడు హఠాత్తుగా పడిపోతాయో తెలియడం లేదు. నిన్న బాగా ఉన్న రేట్లు.. నేడు ఉంటాయో లేదో కూడా ఊహించడం కష్టంగా మారింది. శ్రీసత్యసాయి జిల్లా ఎర్రాయపల్లికి చెందిన సతీష్ నాయుడు, సంజీవపురం గ్రామానికి రాము తమ పొలాల్లో కనకాంబరాలు, బంతిపూలు సాగు చేస్తున్నారు. పొలంలో పూలు విరగ బూయడంతో రైతులు ఎంతో సంతోషపడ్డారు. అయితే, ఇదే సమయంలో మార్కెట్లో ధరలు లేకపోవడం వారిని నిరాశకు గురి చేస్తోంది. కేజీ కనకాంబరాలు రూ.200 నుంచి రూ.250 పలుకుతుండగా, బంతి పూలు కేజీ రూ.40 నుంచి రూ.50 పలుకుతున్నాయి. ప్రస్తుతం నష్టాలకు పూలను విక్రయించాల్సి వస్తోందని, నవరాత్రులకైనా మంచి గిరాకీ రావాలని సతీష్ నాయుడు, రాము ఆకాంక్షిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పొలంలో బంతిపూలు కోస్తున్న రాము దంపతులు

దంచికొట్టారు!

- దులీప్ ట్రోఫీ మ్యాచుల్లో మూడో రోజూ రెచ్చిపోయిన బ్యాటర్లు
- వికెట్లు తీసేందుకు బౌలర్ల ఆపసోపాలు
- సెంచరీకి చేరువలో తెలుగు తేజం రిక్కీ భుయి
- అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్న శ్రేయస్ అయ్యర్, పరాగ్, రావత్



90 పరుగులతో అజేయంగా నిలిచిన రికీ భుయి

అనంతపురం: దులీప్ ట్రోఫీ చివరి రౌండ్ మ్యాచుల్లో మూడో రోజు కూడా బ్యాటర్ల హవా కొనసాగింది. బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన ఆర్డీటీ క్రీడా గ్రామంలో బంతులను దంచిపడేశారు. వీరి వీర విహారంతో బౌలర్లకు చుక్కలు కనిపించాయి.

రెండో సెంచరీకి చేరువలో రికీ భుయి..

ఇండియా–బీ, ఇండియా–డీ మ్యాచ్‌లో శనివారం ఇండియా–డీ జట్టు ఆటగాడు రికీ భుయి ఆకట్టుకున్నాడు. వేగంగా పరుగులు చేసి సెంచరీకి చేరువయ్యాడు. మరో 10 పరుగులు చేస్తే భుయి సెంచరీ పూర్తి కానుంది. మరోవైపు ఇండియా–డీ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అర్ధసెంచరీ చేశాడు. అంతకు ముందు ఇండియా–బీ జట్టులో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ అర్ధ సెంచరీ సాధించాడు.

రికీ భుయి– శ్రేయస్ కీలక భాగస్వామ్యం..

రెండో ఇన్నింగ్స్‌లో రికీ భుయి– శ్రేయస్ కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. వన్‌డౌన్‌లో వచ్చిన ఆంధ్రా కుర్రాడు రికీ భుయి చూడచక్కని షాట్లతో ప్రేక్షకులను అలరించాడు. 87 బంతుల్లోనే 10 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో 90 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. రికీ భుయికి తోడుగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 50 (7 ఫోర్లు, ఒక సిక్సర్), సంజు శాంసన్ 45 (5 ఫోర్లు, రెండు సిక్సర్లు) రాణించారు. దేవదత్ పడిక్కల్ 3, శ్రీకర్ భరత్ 2 పరుగులతో నిరాశ పరిచారు. ఆట ముగిసే సమయానికి ఇండియా–డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసింది. ఇండియా–బీ బౌలర్లు ముకేష్ కుమార్ 3, నవదీప్ సైనీ 2 వికెట్లు తీసుకున్నారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 210/6తో ప్రారంభించిన ఇండియా బీ.. 282 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులో వాషింగ్టన్ సుందర్ 82 (7 ఫోర్లు, 1 సిక్సర్) పరుగులు సాధించాడు. ఇండియా–డీ జట్టు బౌలర్లలో సౌరభ్‌కుమార్ 5, అర్షదీప్‌సింగ్ 3, ఆదిత్య థాక్రే 2 వికెట్లు తీసుకున్నారు. ప్రస్తుతం ఇండియా –డీ జట్టు 311 పరుగుల ఆధిక్యంలో ఉంది.



ఇండియా–బీ, ఇండియా–డీ మధ్య మ్యాచ్‌లో ఓ దృశ్యం

ఆకట్టుకున్న పరాగ్, రావత్

ఇండియా–ఏ, ఇండియా– సీ మధ్య మ్యాచ్‌లోనూ బ్యాటర్లు సత్తా చాటారు. ఇండియా –ఏ క్రీడాకారులు రియాన్ పరాగ్, శాశ్వత్ రావత్ అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. రియాన్ పరాగ్ 101 బంతుల్లో 73 (5 ఫోర్లు, ఒక సిక్సర్), శాశ్వత్ రావత్ 67 బంతుల్లో 53 పరుగులు (4 ఫోర్లు, ఒక సిక్సర్), కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 34, కుమార కుష్రగ 40 పరుగులు సాధించారు. ఇండియా– ఏ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 270 పరుగులు చేసింది. ఇండియా –సీ జట్టు బౌలర్లలో అన్షుల్ కాంభోజ్, గౌరవ్‌కుమార్, మనవ్ సుతార్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌ను ఓవర్‌నైట్ స్కోరు 216/7తో ప్రారంభించిన ఇండియా–సీ జట్టు.. 71 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌట్ అయింది. అభిషేక్ పోరెల్ 82 పరుగులు చేశాడు. ఇండియా–ఏ బౌలర్లు అవేష్ ఖాన్, అకీబ్‌ఖాన్ చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. ప్రస్తుతం ఇండియా–ఏ జట్టు 333 పరుగుల ఆధిక్యంలో ఉంది. మ్యాచ్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ వీక్షించారు.



మ్యాచ్ వీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, మాంఛో ఫెర్రర్



మ్యాచ్ తిలకిస్తున్న ప్రేక్షకులు

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి



సునీత(ఫైల్), రోదిస్తున్న బంధువులు

చెన్నేకొత్తపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం చెన్నేకొత్తపల్లిలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నేకొత్తపల్లికి చెందిన ఎరుకల శంకర్‌కు, పుట్టపర్తి మండలం కొట్లపల్లి గ్రామానికి చెందిన రామక్క కుమార్తె సునీత(35)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె పావని సంతానం. కొంతకాలంగా దంపతుల మధ్య ఘర్షణలు తలెత్తగా సునీత పుట్టింటికి వెళ్లింది. దీంతో శంకర్ మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న సునీత తల్లి, బంధువులు ఇటీవల శంకర్ ఇంటి వద్దకు వచ్చి భార్య ఉండగా, మరొకరితో ఎలా కలిసి ఉంటున్నావని గొడవపడ్డారు. విషయం చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లడంతో పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు. పోలీసుల సమక్షంలోనే శంకర్ తన భార్యను తానే చూసుకుంటానని చెప్పాడు. వారం రోజుల క్రితం భార్య సునీతను తీసుకువచ్చి తన సొంత ఇంటిలో ఉంచాడు. మరో ఇంటిని అద్దెకు తీసుకుని అప్పటికే తనతో కలిసి ఉంటున్న మహిళతో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం సునీత తల్లి రామక్కకు ఫోన్ చేసిన శంకర్ 'మీ కుమార్తె హార్ట్ ఎటాక్‌తో మృతి చెందింది' అని తెలిపాడు. దీంతో హుటాహుటిన చెన్నేకొత్తపల్లికి వచ్చిన రామక్క నిర్జీవంగా ఉన్న కుమార్తె సునీతను చూసి కన్నీరుమున్నీరైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపిక

అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ సుగుణమ్మ తెలిపారు. ఎంపిక కార్యక్రమానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షఫీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అనంతపురం అర్బన్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, హెచ్‌ఎం రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఆ పాపంలో అధికారులకూ వాటా?

- ఫోర్జరీ సంతకాలతో 22 సంఘాల్లో రూ.72 లక్షలు మాయం
- విచారణ పేరుతో హడావుడి
- రికవరీపై అంతులేని నిర్లక్ష్యం
- లబోదిబోమంటున్న మహిళా సంఘాల సభ్యులు


సంఘాల సొమ్ము స్వాహాపై కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

కళ్యాణదుర్గం: ఎండనక... వాననక... కాయ కష్టం చేసి సంపాదించిన మొత్తంలో కొంత భవిష్యత్తు అవసరాల కోసం సంఘంలో దాచుకున్న పొదుపు సొమ్మును స్వాహా చేసిన అంశంలో అధికారులకూ వాటా ఉన్నట్లుగా తెలుస్తోంది. మహిళల అమాయకత్వం... నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకున్న బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్... ప్రతి నెలా క్రమం తప్పకుండా మహిళలు కడుతున్న పొదుపు సొమ్మును స్వాహా చేసిన విషయం తెలిసిందే. కళ్యాణదుర్గంలోని కెనరాబ్యాంక్ శాఖలో చోటు చేసుకున్న ఈ అక్రమాలపై నేటికీ ఎలాంటి రికవరీ లేదు.

ఏం జరిగిందంటే...

కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో హులికల్లు, విట్లంపల్లి, మల్లికార్జునపల్లి గ్రామాలున్నాయి. ఇక్కడ యానిమేటర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ భర్త కళ్యాణదుర్గంలోని కెనరా బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్‌గా కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సంఘాల సభ్యులు దాచుకున్న బ్యాంక్ లింకేజీ పొదుపు సొమ్మును సభ్యులకు తెలియకుండానే రూ.72 లక్షలను స్వాహా చేశాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా పసిగట్టిన మహిళా సంఘాల సభ్యులు నేరుగా కళ్యాణదుర్గంలోని కెనరాబ్యాంక్ శాఖకు వెళ్లి ఆరా తీశారు.

అధికారుల ప్రమేయంతోనే...

ఇంత పెద్ద మొత్తంలో సభ్యుల సొమ్మును ఓ బిజినెస్ కరస్పాండెంట్ స్వాహా చేయడం వెనుక బ్యాంక్ అధికారులతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే వెలుగు సిబ్బందికి వాటాలు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో కళ్యాణదుర్గం కెనరా బ్యాంక్ శాఖలో పనిచేసిన ఓ ఫీల్డ్ ఆఫీసర్‌కు విందు, వసతితో పాటు కొంత ఆస్తిని సైతం ఆఫర్ ఇచ్చి ఈ తతంగాన్ని నడిపినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ స్వాహా పర్వం వెలుగులోకి రాకముందే సదరు ఫీల్డ్ ఆఫీసర్ బదిలీపై వెళ్లిపోయాడు. అయితే ప్రతి నెలా సభ్యుల పొదుపునకు సంబంధించి ఆర్థిక లావాదేవీల పర్యవేక్షణ, ఆడిట్ చేయాల్సిన సీసీలు, ఏపీఎంలు సైతం కొన్నేళ్లుగా ఈ ప్రక్రియను చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావివ్వడంతో మహిళా సంఘాల సభ్యులు ఇటీవల బ్యాంక్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన ఎల్‌డీఎం, కెనరాబ్యాంక్ జిల్లా అధికారులు, వెలుగు అధికారులు కొన్ని రోజుల క్రితం మల్లికార్జునపల్లికి వెళ్లి విచారణ చేపట్టారు. అయితే అంతకు ముందు వెలుగు, డీఆర్‌డీఏ అధికారులు సైతం పలుమార్లు విచారణ చేపట్టారే కానీ, రికవరీపై ఏమాత్రం శ్రద్ధ చూపలేదు.

యానిమేటర్లు, అకౌంటెంట్ తొలగింపు

బ్యాంకు లింకేజీ సొమ్ము స్వాహాపై కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్ అయ్యారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీకి ఆదేశాలిచ్చారు. విచారణ జరిపిన పీడీ బాధ్యులైన యానిమేటర్లు లక్ష్మీ నరసమ్మ, వరలక్ష్మి, అకౌంటెంట్ హనుమంతరాయుడును విధుల నుంచి తొలగించారు. కో ఆర్డినేటర్లుగా పనిచేసిన వన్నూరుస్వామి, బదిలీపై వెళ్లిన ఉద్యోగులు వెంకటేశులు, దొణతిమ్మప్ప, శివప్రసాద్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండా నామ మాత్రంగా విచారణ జరిపి ఉద్యోగులకు షోకాజ్ ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

మల్లికార్జునపల్లికి చెందిన మహిళా సంఘాల బ్యాంక్ లింకేజీ సొమ్ము స్వాహా చేసిన యానిమేటర్ భర్తపై కళ్యాణదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశాం. బ్యాంక్ అధికారులు సైతం రికవరీ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం యానిమేటర్ దంపతులిద్దరూ గ్రామంలో లేరు. దీంతో రికవరీలో జాప్యం చోటు చేసుకుంటోంది. స్వాహా చేసిన ప్రతి పైసా వెనక్కు తెప్పిస్తాం.

– మధుసూదన్ గుప్తా, ఇన్‌చార్జ్ ఏపీఎం, కళ్యాణదుర్గం

కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న క్వాలిఫైడ్ అభ్యర్థులు

అనంతపురం అర్బన్: కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్వాలిఫైడ్ అభ్యర్థులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అప్పట్లో నిర్వహించిన రాతపరీక్షలో 95,208 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. అయితే ఈ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి కోర్టులో ఉన్న కేసు పరిష్కారం కాకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ కేసును పరిష్కరించి పోస్టుల భర్తీ చేపడతామని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అయితే ఈ కేసు విచారణకు ప్రభుత్వం హాజరుకాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి కేసు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. లేనిపక్షంలో స్టే తీసుకొచ్చి నోటిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. అనంతరం డీఆర్‌ఓకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు నూరుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, నాయకుడు భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

- జాయింట్ కలెక్టర్ వినూత్న ఆదేశం
- 142 మందిలో 50 మందికి బదిలీ
- 77 మంది యథాస్థానాల్లో కొనసాగింపు
- ఆరుగురు శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ


బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

అనంతపురం సిటీ: 'సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో అక్రమాలు, ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదేశించారు. కలెక్టరేట్ సమీపంలోని పంచాయతీరాజ్ శాఖ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్‌ను ఆమె పరిశీలించారు. పీఆర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కేవీకేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈఈ చంద్రశేఖర్, డీఈఈ గురుమూర్తి, సూపరింటెండెంట్ గీత, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, జూనియర్ అసిస్టెంట్లు శ్రీకాంత్, జగన్, డీఈఓ రాజేశ్వరి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఎంత మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు, ఎంత మంది హాజరయ్యారనే వివరాలను అసిస్టెంట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లతోనూ ఆమె మాట్లాడారు. ఖాళీల వివరాలు తెలియక తాము గందరగోళానికి గురయ్యామని అభ్యర్థులు వాపోయారు. ఖాళీల వివరాలను డిస్‌ప్లే చేసి ఉంటే బాగుండేదని వారు అభిప్రాయపడ్డారు. 142 మందిలో 50 మందికి బదిలీ చేశారు. కోరుకున్న చోటు దక్కలేదని 77 మంది ప్రస్తుతం పనిచేస్తున్న చోటే కొనసాగుతామని పేర్కొన్నారు. 9 మంది గైర్హాజరు కాగా.. ఆరుగురు అనంతపురం జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారని ఎస్ఈ ప్రసాద్ ప్రకటించారు.

తిరుమల ప్రతిష్టను దెబ్బతీయడమేంటి?

- సీఎం చంద్రబాబు తీరుపై మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



ఉరవకొండ: సీఎం చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం తిరుమల ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయన అనంతపురంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో కలిసిన నెయ్యి వాడారని సీఎం చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతోపవిత్రతతో స్వీకరించే వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని జంతువుల కొవ్వుతో గత ప్రభుత్వ హయాంలో తయారు చేశారని ఆరోపణలు చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. తన వంద రోజుల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. దశాబ్దాలుగా నిపుణుల పర్యవేక్షణలో అత్యంత నాణ్యతా ప్రమాణాలతో శ్రీవారి లడ్డూ తయారవుతోందని స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ జరిగిందని చేసిన ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మరి విచారణ చేయించే దమ్ము సీఎంకు ఉందా అని ప్రశ్నించారు.

చంద్రబాబు 'సూపర్' ఫెయిల్యూర్

- కప్పి పుచ్చుకునేందుకు 'లడ్డూ'పై దుష్ప్రచారం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల హామీల అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు 'సూపర్ ఫెయిల్యూర్' అయ్యారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి సర్కార్ వంద రోజుల పాలనపై ధ్వజమెత్తారు. హామీలు అమలు చేయకుండా వంచన చేసినందుకు ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని.. దాని నుంచి దృష్టి మళ్లించేందుకు కూటమి నేతలు– ప్రజా ప్రతినిధులు తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యతపై దుష్ప్రచారం ప్రారంభించారన్నారు. తిరుమల పవిత్రతను, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా రాజకీయం చేస్తున్న చంద్రబాబుకు పుట్టగతులుండవన్నారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు ఉందని దుష్ప్రచారానికి తెర లేపినందున.. దీనిపై సిట్టింగ్ జడ్జి, సీబీఐతో సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు పైబడిన మహిళలకు నెలకు రూ.1500, ప్రతి ఇంటికీ ఏడాదిలో మూడు గ్యాస్ సిలిండర్లు, 20 లక్షల మందికి ఉద్యోగాలు లేదా నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి, అన్నదాతా సుఖీభవ కింద రైతులకు సాయం హామీల గురించి కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల రద్దుతో 700 యూజీ సీట్లు కోల్పోవాల్సి వచ్చిందని, పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేశారని దుయ్యబట్టారు.

అనువైనది కాకపోయినా అమరావతిపైనే మొగ్గు

రాజధాని నిర్మాణానికి అమరావతి ప్రాంతం అనువైనది కాదని నిపుణులు తెలిపినా.. తమ భూములకు విలువ తెచ్చుకునేందుకు ఆ ప్రాంతానికే ముఖ్యమంత్రి చంద్రబాబు మొగ్గు చూపుతున్నారని ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలోని పేదలకు రూ.2.70 లక్షల కోట్లు పంచారని, ఇప్పుడు పేదలకు మొండిచేయి చూపుతూ నిధులన్నీ అమరావతికి తరలించాలని చంద్రబాబు ఎజెండా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడానికే బడ్జెట్ వాయిదా వేశారన్నారు. వంద రోజుల శాడిస్టు పాలనలో అమూల్ అనే పెద్ద సంస్థను పారదోలారన్నారు. దాడులు, రేపులు చేసినా కేసులుండవనే పాలన తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీరుగంటి నారాయణరెడ్డి, జూటూరు శేఖర్ పాల్గొన్నారు.

బాల, బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా బాలుర జట్టు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో శనివారం జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఫుట్‌బాల్ అండర్-19 బాల, బాలికల ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లను ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, పీడీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ ఆధారంగా వీరిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు త్వరలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాల్గొంటాయని కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఎం స్కూల్ హెచ్‌ఎం సామ్రాజ్యం, పీడీ లోక్‌నాథ్, విలియమ్స్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సలీం, ఆర్డీటీ కోచ్ అంజలి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం మెడికల్: పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటాను కుదిస్తూ జారీ చేసిన జీఓ 85ను రద్దు చేయాలని ఏపీ ప్రాథమిక వైద్యుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణంలో వారు రిలే దీక్షలు చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవందిస్తున్న వైద్యుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నారాయణస్వామి, కోశాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ మహేంద్రనాథ్, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ తేజశ్విని పాల్గొన్నారు.

నేడు మంత్రి నిమ్మల రామానాయుడు రాక

అనంతపురం అర్బన్: రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం జిల్లాకు విచ్చేయనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకుని పరిశీలిస్తారు. అక్కడి నుంచి అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం చేరుకుని టీడీపీ జిల్లా నాయకులతో సమావేశం అవుతారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. తర్వాత ఇక్కడి నుంచి బయలుదేరి చెర్లోపల్లి రిజర్వాయర్ చేరుకుని పరిశీలిస్తారు. అటు నుంచి బయలుదేరి హార్స్‌లీ హిల్స్ చేరుకుని, రాత్రి అక్కడే బస చేస్తారు.

నేడు ఏపీటీఎఫ్ జిల్లా మహాసభలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) జిల్లా మహాసభలు ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ బాల సుబ్రమణ్యం, డాక్టర్ రవిశ్రీనివాస్, డాక్టర్ జి.సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధానకార్యదర్శి కె.కులశేఖర్‌రెడ్డి హాజరవుతారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్ తెలిపారు. 'ఉపాధ్యాయుల అస్తిత్వం', 'విద్యార్థుల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తి-విపరీత ధోరణలు', 'ఉపాధ్యాయ ఉద్యమం-పెడధోరణలు' అంశాలపై వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ మిత్రులు, విద్యారంగ అభిమానులు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: పెనకచెర్ల గ్రామంలో దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రావణి, గంగాధర్ దంపతులు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రావణి పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కాసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తరువాత భర్త గంగాధర కూడా పురుగుమందు తాగాడు. ఇతడిని కూడా అదే ఆస్పత్రికి తరలించారు. వీరి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రైలు ప్రయాణికుల సెల్‌ఫోన్ల చోరీలో దిట్టలు
- రైల్వే పోలీసులమంటూ నగదు నొక్కేయడంలోనూ సిద్ధహస్తులు


పట్టుబడిన దొంగలతో ఎస్ఐ విజయకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది

అనంతపురం సిటీ: రైలు ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు అపహరించే ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అనంతపురం జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు గుత్తి పోలీసుల సహకారంతో శనివారం అరెస్టు చేశారు. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కుమ్మరంపల్లికి చెందిన బి.చిన్నికృష్ణ కుమారుడు భూక్యా సునీల్‌కుమార్ అలియాస్ సునీల్, అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగళ్ల గ్రామానికి చెందిన రమణారెడ్డి కొడుకు కోమలి వినయ్‌కుమార్‌రెడ్డి, అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లికి చెందిన ఎం.వెంకటనాయుడు కుమారుడు మాచినేని సంతోష్‌కుమార్ అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను ఎస్ఐ విజయకుమార్ మీడియాకు వెల్లడించారు. భూక్యా సునీల్‌కుమార్ అలియాస్ సునీల్, కోమలి వినయ్‌కుమార్‌రెడ్డి, మాచినేని సంతోష్‌కుమార్‌లు రైళ్లల్లో ఎక్కడం, తోటి ప్రయాణికులను ఏమార్చి వారి సెల్‌ఫోన్లు కొట్టేయడంలో దిట్టలని తెలిపారు. ఆ తరువాత 'మేం రైల్వే పోలీసులం. మీరు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ మాకు దొరికింది. ఒకసారి మీ సెల్‌ఫోన్ పాస్‌వర్డ్ చెబితే మీదో కాదో నిర్ధరించుకొని మీకు పంపుతామ'ంటూ' నమ్మిస్తారన్నారు. ఆ తరువాత బాధితులు పాస్‌వర్డ్ చెప్పగానే వారి సెల్‌ఫోన్లలోని వాట్సాప్, ఫేస్‌బుక్ అకౌంట్లకు రకరకాల కారణాలు చెబుతూ డబ్బు డిమాండ్ చేయడం పరిపాటిగా మారిందన్నారు. వీరికి రిప్లై ఇచ్చిన వారికి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్ స్కానర్ పంపుతారని, ఆ తరువాత డబ్బు పంపగానే అవి ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్‌లోకి పంపుతున్నారని చెప్పారు. అలా బెట్టింగ్‌లు ఆడుతూ జల్సాలు చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల సంఘం సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (ఏడీపీఎస్ఏ) సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం నిర్వహించనున్నారు. అనంతపురంలోని సంగమేష్‌నగర్‌లో గల ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించే సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు హాజరవుతారని జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సీఆర్‌ఓ రవిచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా, శ్రీ సత్యసాయి జిల్లా నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు రేణుక

పుట్లూరు: బాలాపురం గ్రామానికి చెందిన రేణుక (28) అనే వివాహిత శనివారం కర్నూలు జిల్లాలో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుట్లూరు మండలం బాలాపురానికి చెందిన రేణుకకు ఇదే గ్రామానికి చెందిన గురుదేవ్‌తో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తకు దూరంగా.. తన తండ్రి పెద్దయ్య వద్ద ఉంటోంది. వారం రోజుల క్రితం కర్నూలు జిల్లా కొలింగుండ్ల మండలం తుమ్మలపెంటలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె మృతదేహాన్ని బాలాపురం గ్రామానికి తీసుకరాగా విషయం తెలుసుకున్న ఎస్ఐ హేమాద్రి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కొలింగుండ్ల పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

క్లుప్తంగా

స్వచ్ఛతకు పాటుపడదాం



నీరు ప్రగతి వనంలో
చెత్త ఊడుస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు పాటుపడాలి. నగరాన్ని శుభ్రంగా ఉంచుకుందామని మేయర్ వసీం పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న నీరు ప్రగతి వనంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్, డిప్యూటీ మేయర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు చీపురు పట్టుకుని పార్కులో చెత్తా చెదారాన్ని ఊడ్చివేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు కమల్ భూషణ్, నాయకులు కాకర్ల శీన పాల్గొన్నారు.

డాక్టర్ సుహాసినికి మెమో

అనంతపురం మెడికల్: వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించిన ప్రైవేట్ డాక్టర్ సుహాసినికి మెమో జారీ చేసినట్లు డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న కళ్యాణదుర్గం మానిరేవు గ్రామానికి చెందిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ అనంతపురంలోని సంగమేష్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ డాక్టర్ సుహాసిని చేసిన చికిత్స వికటించడంతో విద్యార్థి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు మరో ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ శనివారం ఆ ఆస్పత్రికి వెళ్లి బాధిత విద్యార్థిని పరామర్శించారు. అనంతరం డాక్టర్ సుహాసినిని విచారణ చేసి.. మెమో జారీ చేశారు.

ఆర్థికసాయం అభినందనీయం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న
గ్లోబల్ విద్యాసంస్థల యాజమాన్యం

అనంతపురం అర్బన్: వరద బాధితులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక టీవీ టవర్ సమీపంలోని గోబల్ విద్యాసంస్థల యాజమాన్యం రూ.2,00,116 విరాళంగా ఇచ్చింది. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో అందజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వంతుగా సామాజిక సేవలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అకడమిక్ డీన్ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, పాఠశాల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పట్టు రైతుల వైజ్ఞానిక యాత్ర

అనంతపురం అగ్రికల్చర్: మల్బరీ సాగులో ఆధునిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై అవగాహన నిమిత్తం జిల్లాకు చెందిన 45 మంది మల్బరీ రైతులు వైజ్ఞానిక యాత్రకు వెళ్లినట్లు పట్టుశాఖ జిల్లా అధికారి డి.ఆంజనేయులు తెలిపారు. ఒక బ్యాచ్ శుక్రవారం వెళ్లగా రెండో బ్యాచ్ కింద శనివారం మరికొందరు రైతులు బయలుదేరి వెళ్లారు. బెంగళూరు, మైసూరు ప్రాంతాల్లో పర్యటిస్తారు. అక్కడ రైతులు సాగు చేసిన మల్బరీ పంట, సాగు పద్ధతులు, వారి అనుభవాలు, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టుపురుగులకు ఆశించే సీజనల్ వ్యాధులు, వాటి నివారణలో అనుసరిస్తున్న విధానాల గురించి తెలుసుకుంటారని తెలిపారు. రైతుల వెంట సెరికల్చర్ ఆఫీసర్ ఓబులేసు వెళ్లారు.

మహిళ ప్రాణం కాపాడిన పోలీసులు



ట్రాక్ వద్ద నుంచి మహిళను
పక్కకు తీసుకొస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్: ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన మహిళను పోలీసులు సకాలంలో కాపాడారు. 'డయల్ 100' సమాచారంతో ఆమె ప్రాణం నిలిచింది. అనంతపురం పాతవూరు కాలనీలో నివాసం ఉంటున్న వీరాచారి భార్య శాంత కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది నాలుగు రోజుల క్రితం హిందూపురంలోని సిల్క్ కాలనీలో గల బంధువుల ఇంటికి వచ్చింది. శనివారం సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కకు వెళ్లి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైంది. గమనించిన వ్యక్తులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సీఐ అబ్దుల్ కరీం సిబ్బందిని అక్కడికి పంపారు. వారు శాంత ప్రాణాలు కాపాడి స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సమస్య వచ్చినపుడు పరిష్కారానికి ఆలోచన చేయాలే కానీ ఆత్మహత్యకు ప్రయత్నించరాదని కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబ సభ్యులను పిలిపించి ఆమెను అప్పగించారు. టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, సిబ్బంది మోతీలాల్ నాయక్, శ్రీరాములును ఎస్పీ రత్న అభినందించారు.



ఇటీవల రజకనగర్‌లో ఇంట్లోకి చేరిన నీరు (ఫైల్)

మోకాళ్ల ఎత్తులోకి వస్తున్న నీరు..

నగరంలోని నడిమివంకకు అనుకుని 5, 6 రోడ్లు, యువజన కాలనీ, రంగస్వామి నగర్, రజక కాలనీ, సోమనాథ్ నగర్, గౌరవ గార్డెన్, రెడ్డివారి కాలనీలు ఉన్నాయి. దాదాపుగా 10 వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వరదలు వస్తే ఇళ్లలోకి మోకాళ్ల ఎత్తులోకి నీరు వస్తోంది. దీంతో ప్రజలు బిక్కు బిక్కు మంటూ ఉంటున్నారు. ఇటీవల వర్షాలు కురిసినప్పుడు స్థానికంగా ఉండే ఓ వ్యక్తి వంకను పూడ్చేయడంతో ఆ కాలనీలను వరద చుట్టు ముట్టింది. ప్రజలు ప్రత్యక్ష నరకం చూశారు. కానీ ఎమ్మెల్యే దగ్గుపాటి అక్కడకు ఆలస్యంగా ప్రత్యక్షమై షో చేశారు. కానీ వాటికి శాశ్వత పరిష్కారం చూపలేదు. నగరపాలక సంస్థ స్థలాలను పరిరక్షించి, మినీ పార్కులను నిర్మిస్తామని ఎమ్మెల్యే చెప్పినా.. వాస్తవంగా నగరంలో 25 పార్కులు ఉన్నాయి. పట్టుమని 5 పార్కులు మినహా మిగతా పార్కుల్లో సౌకర్యాలు మృగ్యంగా ఉన్నాయి. పార్కులను అభివృద్ధి చేయలేని నిస్సహాయ స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారు.

కమ్మేస్తున్న పొగ

కంపోస్టు యార్డు తరలించక పోవడంతో నిత్యం అక్కడ మంటలు చెలరేగుతున్నాయి. దీంతో గుత్తి రోడ్డు, రాజీవ్‌కాలనీ, లెక్చరర్స్ కాలనీ, ఎర్రనేల కొట్టాలు తదితర ప్రాంతాలను పొగ చుట్టేస్తుంది. అందులో దుర్గంధమైన పొగ వస్తుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడనున్నారు.



నగరంలోని కంపోస్టు యార్డులో
మంటలు చెలరేగడంతో కమ్మేసిన పొగ (ఫైల్)

దగాపాటి



- ఒక్క హామీ నెరవేర్చని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- అటకెక్కిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ
- ప్రశ్నార్థకంగా కంపోస్టు యార్డు తరలింపు
- ఊసేలేని పరిశ్రమలు
- పార్కుల అభివృద్ధి శూన్యం
- ఎమ్మెల్యే పనితీరుపై ప్రజల అసంతృప్తి



ఎన్నికల సమయంలో
దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఇచ్చిన హామీలు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల ముందు అలివిగాని హామీలతో గద్దెనెక్కిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికిన ఆయన.. వారంలో మూడు రోజుల పాటు నగర ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారు. తన అనుచరులకు అంతా అప్పగించి పైపైన చూసుకోవడం దినచర్యలో భాగమైపోయింది. సొంత పార్టీకి చెందిన నాయకులే ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గీయుల బరితెగింపుపై సాక్షాత్తు ఎస్పీకి ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదు.

అభివృద్ధికి మోకాలడ్డు

నగరంలో అభివృద్ధి జరగకుండా ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు మోకాలడ్డుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని వివిధ డివిజన్లలో రూ.18 కోట్ల అభివృద్ధి పనులు ప్రశ్నార్థకంగా మారాయి. ఎస్‌క్యాప్ నిధులు రూ.11 కోట్లు (21 పనులు) మంజూరు కాగా.. అందులో రూ.4 కోట్ల పనులు (10 పనులు) మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా మిగితా పనులు పూర్తి కావాల్సింది. అలాగే నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.11 కోట్లతో నగరంలో 70 పనులు చేపట్టాలని నిర్ణయించారు. టెండర్లు తమ వారే వేసుకుంటారని నెలలు తరబడి అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్నారు. ఇప్పటికీ అగ్రిమెంట్ దశలోనే 70 పనులు ఉన్నాయి.

పూడిక మాయ

వరదల కారణాన్ని చూపి నగరంలోని నడిమివంక, మరువవకంలో పూడికతీత పనులు చేపట్టారు. ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరుడైన ఓ కాంట్రాక్టర్ పేరు మీద నిబంధనలకు విరుద్ధంగా పనులను అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పనులు చేసి రూ.29 లక్షల బిల్లు పెట్టాడు. అదే విధంగా నగరంలో ఏర్పాటు చేసిన మూడు అన్నా క్యాంటీన్లను సదరు ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరుడికే నిబంధనలను అతిక్రమించి కట్టబెట్టారు. ఎటువంటి వర్క్ ఆర్డర్ ఇవ్వకుండానే సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు.

హామీలు కాగితాలకే పరిమితం

నగరంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పిన మాటలు చిత్తు కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాలతో మేయర్ వసీం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రిని కలవడం జరిగింది. రూ.750 కోట్లతో ప్రతిపాదనలు కేంద్రానికి పంపారు. కాగా ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి దగ్గుపాటి ఏనాడూ అండర్ గ్రౌండ్ డేనేజీ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

- నగరంలో పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి.. ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
- ఆరో నెలల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్న ఆయన ఒకసారి పండమేరులో పర్యటించి అసలైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తామంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేశారు. కానీ ఇంత వరకు వాటి పనుల పురోగతిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే 60 నుంచి 70 శాతం పనులు పూర్తయ్యాయి.
- ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం ఊసేలేదు.
- ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అత్యవసర విభాగాలైన ఎమర్జెన్సీ మెడిసిన్, అక్యూట్ మెడికల్ కేర్, తదితర విభాగాల్లో పడకల కొరత పట్టి పీడిస్తోంది. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో కేవలం 20 పడకలు మాత్రమే ఉన్నాయి. అందులోనూ ఇరుకుగా ఉండటంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని బలోపేతం చేయాల్సి ఉంది. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ల్యాబ్ టెక్నీషియన్లు, తదితర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.
- అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌ను బలోపేతం చేయాలి. ఆ యూనిట్‌లో ఏసీలు లేవు. ఆక్సిజన్ కాన్‌సెన్‌ట్రేటర్‌కు వినియోగించే మాస్కుల కొరత పట్టి పీడిస్తోంది. అసలు ఎమ్మెల్యే ఏదైనా కార్యక్రమంపైన తప్పితే ఏనాడు ఆస్పత్రిని తనిఖీ చేయాలనే ఆలోచనే లేదు. ఒక వేళ ఎమ్మెల్యే ఏదైనా కార్యక్రమంపై వచ్చినా ఆయన అనుచర గణం చేసే ఓవరాక్షన్‌తో వైద్యులు, సిబ్బందికి ముచ్చెమటలు పడుతున్నాయి.

చెత్త తీయరు.. తీసుకుపోరు



రోజూ చెత్తను తొలగించే పరిస్థితే ఉండదు. నడిమివంకలో చూడండి ఎక్కడో చెత్త అంతా గుట్టలు గుట్టలుగా ఇక్కడే ఉంటుంది. ప్లాస్టిక్, వ్యర్థాలు ఇళ్ల ముందుకు వస్తాయి. కంపు భరించలేం. చెత్తను తీయరు.. వాటిని తీసుకుపోరు. నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలి. పెద్ద కాలువలు వెళ్లే ప్రాంతాలపై దృష్టి సారించాలి.

– ఓబులేసు, అనంతపురం

పరిశ్రమలు ఎప్పుడు తీసుకొస్తారు?



నా ఇద్దరు బిడ్డల్లో ఒకరు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అందులో చాలీచాలని వేతనాలు వస్తాయి. అదే పెద్ద పరిశ్రమలు తీసుకువస్తే మాలాంటి వారితో పాటు ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. మంచి జీతం ఉంటుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగాలు ఇవ్వాలి.

– వెంకటలక్ష్మి, అనంతపురం



నడిమి వంకను చుట్టుముట్టిన వరద (ఫైల్)

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి



వంకలకు అడ్డుగా ఆక్రమణలు చేపడితే ఎలా? ఇటీవల రెడ్డివారి కాలనీ వెనుక వైపు ఓ వ్యక్తి నడిమివంకకు అడ్డుగా మట్టి వేశాడు. దీంతో నీరు వెళ్లక రివర్స్‌లో నడిమివంకకు అనుకుని ఉన్న ప్రాంతాల్లోకి నీరు చేరింది. వారం రోజుల పాటు నరకయాతన చూశాం. ప్రజాప్రతినిధులు ముందస్తుగా ఇటువంటి సమస్యలు లేకుండా ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి. ఎప్పుడో ఎన్నికలకు ముందు వచ్చి వెళ్లిపోవడం కాదు. ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– పద్మ, అనంతపురం

వర్షం వస్తే అంతే..



వర్షం వస్తే భయపడాల్సిందే. ఎప్పుడు నడిమివంక పొంగి ఇళ్లలోకి నీరు వస్తుందో తెలియదు. ఎక్కడ పిల్లలు, పెద్దల ప్రాణం మీదకు వస్తుందని బిక్కు బిక్కుమంటూ ఉండాల్సిందే. నడిమివంకకు ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేస్తామని టీడీపీ నాయకులు చెప్పారు. ఇంత వరకు అతీగతీ లేదు. రక్షణ గోడలైనా ఏర్పాటు చేస్తే కాస్త ఊపిరి పీల్చుకుంటాం. దయచేసి ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోండి సార్.

– భారతి, అనంతపురం

హామీల అమలు సంగతేంటి?

అనంతపురం కార్పొరేషన్: అలివిగాని హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వంద రోజులైనా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మేయర్ వసీం ఆరోపించారు. శనివారం రాంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేశానని చెప్పుకునే ఆయన ఏనాడు ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కేవలం అధికారం కోసమే హామీలను గుప్పిస్తారన్నారు. గత ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టారన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల మందికి ఉద్యోగాలు, ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఉచితం, రైతు భరోసా తదితర హామీలను అటకెక్కించారన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన పథకాలను తొలగించారన్నారు. ఇప్పుడు క్వార్టర్ మద్యం రూ.99 కే ఇస్తామని చెబుతున్నారన్నారు. వంద రోజుల టీడీపీ పాలనలో కక్ష్యసాధింపు చర్యలు, ప్రాజెక్టుల పేర్లు మార్పు, సెబ్ రద్దు, సీబీఎస్సీ సిలబస్ రద్దు తప్ప ఏమీ చేయలేదన్నారు. పేద విద్యార్థులు తెల్ల కోటు వేసుకునేందుకు వీలు లేకుండా వైద్య కళాశాలలకు అడ్డుకట్ట వేశారన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జగనన్న పులివెందుల వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తే.. ఎంబీబీఎస్ సీట్లు అవసరం లేదని కేంద్రానికి లేఖ రాయడం బాధాకరమన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చలేని కూటమి ప్రభుత్వం రోజుకు ఏదో ఒక సమస్యను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

నోరుమెదపని దగ్గుపాటి..

ఎన్నికలు ముందు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, కంపోస్టు యార్డు తరలింపు, రింగ్ రోడ్డు, ఉపాధి కల్పన, తదితర వాటిని హామీలిచ్చి వాటిపై నోరుమెదపడం లేదన్నారు. హామీలను నెరవేర్చేందుకు ఎమ్మెల్యే కనీస ప్రయత్నం చేయాలన్నారు. గత పాలనకు ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను ప్రజలంతా గమనిస్తున్నారని.. రాబోయే రోజుల్లో ప్రజలు తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై సీబీఐతో విచారణ చేయించాలి

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో భారీగా అవినీతి జరిగింది. ఇటీవల జరిగిన బదిలీల్లో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారాయి. సీబీఐతో విచారణ జరిపించాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్‌పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం చేసిన మంచి గురించి పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం చూశామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఘనకార్యాలు కూడా ప్రకటనల రూపంలో తెలియజేయాలని కోరారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, కూటమి నాయకులు అడ్డగోలుగా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అక్రమంగా డబ్బు వసూలు చేశారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల పోస్టింగ్‌లో పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు ప్రజా ప్రతినిధులు పాల్పడారన్నారు. గ్రామ స్థాయి పోస్టింగ్‌ల నుంచి రెవెన్యూ డివిజన్ స్థాయి పోస్టులకు రూ.50 వేల నుంచి 50 లక్షల వరకు ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నయాన్నారు. ఇటీవల జరిగిన బదిలీలపై సమగ్రంగా విచారించాలని కోరారు.

క్రీడల్లోనూ రాణించాలి

రాప్తాడు/ఆత్మకూరు: రాప్తాడు, ఆత్మకూరు మండల కేంద్రాల్లో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరాగా జరిగాయి. ప్రతిభ కనబరచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఉపాధ్యాయులు అన్నారు.

నారాయణస్వామి సేవలు చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: జిల్లా నాటక రంగానికి నారాయణ స్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు అధికారులు, కళాకారులు అన్నారు. శనివారం రాత్రి ప్రసిద్ధ కళాకారుడు గాజుల నారాయణస్వామి 80వ జయంతిని నిర్వహించారు. స్థానిక లలిత కళాపరిషత్తులో వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య, డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, సీనియర్ నటుడు సంగాల నారాయణస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. నటుడిగా, దర్శకుడిగా మైమరపించిన నారాయణ స్వామి ఎల్కేపి కార్యదర్శిగా ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఆయన ద్వారానే జిల్లాకు ఐదు నంది అవార్డులు వచ్చాయని గుర్తు చేసుకున్నారు. నంది నాటకోత్సవాలకు సంసిద్ధమైన 'శకుని' నాటకాన్ని నటీనటులు అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఆచార్య సుధాకర బాబు, నారాయణస్వామి సతీమణి రామలక్ష్మి పలువురు నటీనటులు ఎల్కేపీ సిబ్బంది నారాయణస్వామి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.



గాజుల నారాయణ స్వామి చిత్రపటానికి
నివాళులర్పిస్తున్న అధికారులు, కళాకారులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

అనంతపురం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి అన్నారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. మమత ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ గ్యాంగ్స్ వల్ల చాలా మంది విద్యార్థులు, ప్రజలు నష్టపోతున్నారన్నారు. అనుమానాస్పద లింక్స్‌ను క్లిక్ చేయకూడదని సూచించారు. పిన్ నంబర్స్, పాస్‌వర్డ్‌ను అపరిచితులతో షేర్ చేయకూడదన్నారు. రీసోర్స్‌పర్సన్ ఐఎస్ఈఏ, సీ–డ్యాక్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.జగదీష్ జి.బ్యాబ్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల పెరుగుదల కారణంగా సైబర్ నేరాలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. సైబర్ బెదిరింపులు ప్రమాదకరంగా మారినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సైబర్ సెక్యూరిటీ బెస్ట్ ప్రాక్టీసెస్‌ను విద్యార్థులకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సిస్కో (చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ ట్రైనింగ్) ప్రతినిధి డాక్టర్ సి. రామకృష్ణయ్య, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, పీఆర్వో డాక్టర్ బి.ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

అనంతపురం: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించడం సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జ్యోత్స్న, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాల పెంపుదలపై దృష్టి

అనంతపురం: ఉద్యోగ నైపుణ్యాల పెంపుదలపై దృష్టి కేంద్రీకరించినట్లు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి అన్నారు. శనివారం సెంట్రల్ వర్సిటీలో ఉద్యోగ నియామక విభాగం ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ సింపోజియం నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సులో అన్ని విభాగాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థులు పాల్గొన్నారు. డీన్ ప్రొఫెసర్ సి.షీలా రెడ్డి, ప్లేస్‌మెంట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి. మాలతి, కో–ఆర్డినేటర్ డాక్టర్ వీఎస్ఎస్ శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో స్పోర్ట్స్ మీట్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కోర్ట్ రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్‌ను ఆ పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆందోళనల నుంచి విముక్తి కలగాలంటే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల ద్వారా శరీరాకృతి కూడా మారుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, ఏఓ గోపాల్, డీన్లు అప్పల నాయుడు, సిరాజుద్దీన్, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఇర్షాద్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు భారతి, మంజుల, పీఈటీలు భరత్, గాయత్రి, అన్వేష్ పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని సన్నద్ధమవ్వాలి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సన్నద్ధమైతే కచ్చితంగా విజయం సాధిస్తారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో బీకామ్ గ్రూపులో కొత్తగా చేరిన విద్యార్థులకు చేరిన వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. వాణిజ్య విభాగం ఇన్‌చార్జ్ ఆర్.శ్రీరాములు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగపు అధ్యాపకులు జి.శేఖర్, ఎం.వెంకటస్వామి, ప్రభాకర్ రెడ్డి, సి.సుమంగళి, బి.షర్మిల, రామయ్య, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆధునిక సాహితీ యుగకర్త గురజాడ

అనంతపురం కల్చరల్: విశాలాంధ్ర బుక్ హౌస్‌లో గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. తెలుగు వెలుగు సంస్థ, గుర్రం జాషువా సాహిత్య పీఠం సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆంధ్ర సాహితీ చరిత్రలో మహాకవిగా సుప్రసిద్ధులైన గురజాడ రచనా జీవితం యావత్తూ సంఘ సంస్కరణోద్యమానికి, ఆధునిక అడుగు జాడల వైపు సాగిందన్నారు. కార్యక్రమంలో టీవీ రెడ్డి, నానీల నాగేంద్ర చెట్ల ప్రవీణ్, విజయభాస్కర రెడ్డి, సాయి పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఎస్ఎస్‌బీఎన్ తెలుగు శాఖ, మహిళ సాధికారత సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కార్యదర్శి నిర్మలమ్మ, వైస్ ప్రిన్సిపాల్ దేవకి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, రచయిత షేక్ రియాజుద్దీన్, ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ, మహిళా సాధికారత ప్రతినిధి మాధవి పాల్గొన్నారు.

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి గురుజాడ వెంకట అప్పారావు 163వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గరికపాటి గురజాడ, తెలుగు అధ్యాపకులు డాక్టర్ మల్లిపూడి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.